నమస్తే తెలంగాణ
సిద్ధిపేట

15 | హైదరాబాద్, బుధవారం 14 ఫిబ్రవరి 2024 | SIDDIPET

- 'చలో నల్లగొండ' సభకు తరలివెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు
- ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి భారీగా హాజరు
- సమన్వయం చేసిన హరీశ్‌రావు
- సభ విజయవంతం, కేసీఆర్ స్పీచ్‌తో పార్టీలో జోష్

సంగారెడ్డిలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

వైద్య వృత్తి చాలా గొప్పది

- వైద్యులుగా ఎదిగి ప్రజలకు సేవలు అందించాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి
- మెడికల్ కళాశాల పనులు, ప్రభుత్వ దవాఖాన పరిశీలన

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 13: వైద్య వృత్తి అత్యంత ఉన్నతమైనదని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. విద్యార్థులు సబ్జెక్టులపై పూర్తి అవగాహన పెంచుకుని కష్టపడి చదవాలని, నైపుణ్యం గల వైద్యులుగా ఎదిగి ప్రజలకు సేవలం దించాలని ఆకాంక్షించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల పనుల పురోగతి, ప్రభుత్వ జనరల్ దవాఖానను సందర్శించారు. కళాశాల రెండో బ్లాక్‌లో నిర్మాణంలో ఉన్న హాస్టల్, పరిపాలన భవన పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా భవనాలను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్, ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. మెడికల్ కళాశాల, ప్రభుత్వ జనరల్ దవాఖాన ప్రహరీ పూర్తి చేయాలని సూచించారు. వైద్య విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ డాక్టర్ వృత్తి గౌరవప్రదమైన దని తెలిపారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలో అన్ని వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఓపీ, డయాలసిస్ సెంటర్, ఎంసీహెచ్, స్కానింగ్, రేడియాలజీ విభాగం, ల్యాబ్స్ తదితర విభాగాలను తనిఖీ చేశారు. రోగులు, నవజాత పిల్లల తల్లులు, గర్భిణులతో కలెక్టర్ మాట్లాడారు. వైద్య సేవలపై ఆరా తీశారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు పట్టాలని, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. దవాఖానకు ఇంకా ఏమైనా పరికరాలు అవసరమైతే ప్రతిపాదనలు అందిస్తే మంత్రి దృష్టికి తీసుకెళ్తామని అధికారులకు సూచించారు. కలెక్టర్‌వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్, ఆర్‌అండ్‌బీ అధికారులు, తహసీల్దార్ తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్‌అర్బన్, ఫిబ్రవరి 13: ప్రమాదాలు, అనారోగ్యంతో ప్రాణాపాయంలో ఉన్నవారిని కాపాడేందుకు ఆరోగ్య వంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఏసీపీ రమేశ్ అన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని సమీకృత మార్కెట్లో ఆపన్నహస్తం మిత్రబృందం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి శిబిరాన్ని ప్రారంభించగా, ఏసీపీ రమేశ్ రక్తదానం చేశారు. మొత్తం 50 యూనిట్ల రక్తాన్ని సేకరించి సిద్దిపేటలోని ప్రభుత్వ బ్లడ్‌బ్యాంక్ అధికారులకు అప్పగించారు. కార్యక్రమంలో ఆపన్నహస్తం మిత్రబృందం అధ్యక్షుడు బాలచంద్రం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్యాంప్రసాద్, ఉపాధ్యక్షుడు మంగళిసాయి, సభ్యులు కొలిచెలిమి స్వామి, సత్యనారాయణ, కృష్ణ, శ్రీకాంత్, గిరిబాబు, అరవింద్, గణేశ్, రఘు, రాణి, శిరీష, వాట్సాప్ గ్రూపుల సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి

సిద్దిపేట సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, సీపీ

సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 13: జిల్లాలో గుడుంబా, గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలను నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సరఫరా, వినియోగాన్ని పూర్తిగా రూపుమాపాలని సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మిషన్ పరివర్తన' కార్యక్రమం అమలుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని, నిరోధానికి మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు బానిస కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూడాలని, ప్రతి ఒక్కరూ విధిగా మాదకద్రవ్యాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు కలిసి యాంటీ డ్రగ్ కమిటీలుగా ఏర్పడాలన్నారు. ఈ కమిటీలు డ్రగ్స్ సరఫరా నియంత్రణపై దృష్టి పెట్టడంతో పాటు అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు తీసుకున్నట్లు, సరఫరా చేసినట్లు తెలిస్తే వెంటనే ఈ కమిటీలు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సీపీ అనురాధ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల సరఫరా చాలా తక్కువగానే ఉందని, ఇప్పటినుంచే పూర్తిగా నియంత్రించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో గంజాయి రవాణా జరుగుతున్నట్లు వినిపిస్తుందని, దాన్ని పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. అనంతరం డ్రగ్ ఈజ్ బ్యాగ్, సే గుడ్ బై డ్రగ్స్ గోడ పత్రికలను కలెక్టర్, సీపీ ఆవిష్కరించారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, డీఎఫ్‌వో శ్రీనివాస్, డీడబ్ల్యూవో రామ్‌గోపాల్‌రెడ్డి, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ అధికారుల బదిలీ

సంగారెడ్డి, ఫిబ్రవరి 13: సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్‌స్టేషన్ అశోక్ రాచకొండ ఎస్‌హోటీ డీసీపీగా బదిలీపై వెళ్లారు. డీటీసీ అదనపు ఎస్పీగా పనిచేస్తున్న రాములు నాయక్ నల్లగొండ అడ్మిన్‌స్టేషన్ అదనపు ఎస్పీగా బదిలీ అయ్యారు. ఏపీపీ, ఎస్‌డీపీవోలు, డీఎస్పీలకు రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి జితేందర్ బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. డీటీసీలో విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డిని పటాన్‌చెరుకు, పటాన్‌చెరు ఏసీపీ పురుషోత్తంరెడ్డిని మల్కాజిగిరి రాచకొండకు బదిలీ చేశారు. జహీరాబాద్ ఏసీపీ రఘు సివిల్ డీఎస్పీగా బదిలీపై వెళ్లనున్నారు. జహీరాబాద్ డీఎస్పీగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి బదిలీపై రానున్నారు. డీసీఆర్‌బీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న బాలాజీని ఏసీపీ గజ్వేల్‌కు బదిలీ చేశారు. సంగారెడ్డి ఎస్‌డీపీవోగా పని చేస్తున్న రమేశ్‌కుమార్‌ను హైదరాబాద్ సీఎస్‌డబ్ల్యూ ఏసీపీగా బదిలీ చేశారు. సీఐడీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సత్తయ్య సంగారెడ్డి ఎస్‌డీపీవోగా బదిలీపై రానున్నారు.

ఎక్సైజ్ అధికారుల బదిలీలు

సంగారెడ్డి అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ రఘురామ్ సీపీఅండ్‌ఈ డీసీ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. సంగారెడ్డి ఎస్‌హెచ్‌వో మధుబాబును ధూల్‌పేట్-1 ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. కొండమడుగులో సీపీ నందిని, ఓడీ ఐఎంఎల్ డిపోలో విధులు నిర్వహిస్తున్న ఎండీ నజీర్ పాషాను సంగారెడ్డి ఎస్‌హెచ్‌వోలుగా నియమించారు. ఏపీ మెటల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ ఐడీఏ బొల్లారంలో విధులు నిర్వహిస్తున్న శిరీషను హైదరాబాద్ డీటీఎఫ్‌కు బదిలీ చేశారు. నారాయణపేట్ ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న కవిత ఏపీ మెటల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ ఐడీఏ బొల్లారానికి బదిలీ అయ్యారు. పటాన్‌చెరు ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న సీతారాంరెడ్డిని ఇబ్రహీంపట్నం ఎస్‌హెచ్‌వోగా, డీటీఎఫ్ నాగర్‌కర్నూల్‌లో పనిచేస్తున్న పరమేశ్వర్ గౌడ్‌ను పటాన్‌చెరుకు బదిలీ చేశారు. జహీరాబాద్ ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న అశోక్‌కుమార్‌ను నారాయణపేట ఎస్‌హెచ్‌వోగా, అందోల్‌లో పనిచేస్తున్న సుబ్రహ్మణ్యాన్ని సీపీ కృష్ణ-1కు బదిలీ చేశారు. జహీరాబాద్ సీపీగా ఉన్న భిక్షారెడ్డిని హైదరాబాద్ ఎస్‌టీఎఫ్‌కు, ఆన్‌హెన్సర్ బేవరీస్‌లో పనిచేస్తున్న సునీతను యూఎస్‌కే నాచారానికి బదిలీ చేశారు. హైదరాబాద్ ఎస్‌టీఎఫ్ నుంచి మోహన్‌బాబును ఏపీ మెటల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ ఐడీఏ బొల్లారానికి బదిలీ చేశారు. ఎంఎల్ డిపో రంగారెడ్డి-1 నుంచి సాగర్‌రెడ్డిని అందోల్ ఎస్‌హెచ్‌వోగా, వైన్ డిల్ డిస్టిల్లరీస్ ఓడీ క్రౌన్ బీర్స్‌లో విధులు నిర్వహిస్తున్న నీరజాదేవిని పరిగి ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు.

గజ్వేల్ అర్బన్: నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

దండులా కదిలారు

సిద్దిపేట, ఫిబ్రవరి 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'చలో నల్లగొండ' సభకు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నేతృత్వంలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నేతలు, ముఖ్య కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, చంటి క్రాంతికిరణ్, మహిపాల్‌రెడ్డి భూపాల్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ నేతలు కదిలివెళ్లి జంగ్ సైరన్ మోగించారు. శాసనసభ ఎన్నికల తర్వాత తొలి సభ నల్లగొండలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన తొలి సభకు జిల్లా నుంచి భారీగా తరలివెళ్లి విజయవంతం చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన సమయంలో సభలకు వెళ్లిన పార్టీ క్యాడర్ పదేండ్ల తర్వాత మళ్లీ ఉద్యమ సభకు వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేచ్చేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతున్నది. ప్రధానంగా కరెంట్, సాగునీటి, తాగునీటి తదితర వాటిపై ఫోకస్ పెట్టనున్నది. ప్రజల పక్షనా నిలబడి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కేసీఆర్ ఇచ్చిన పిలుపుతో పార్టీ యంత్రాంగం సిద్ధమవుతోంది. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్, జహీరాబాద్ స్థానాలు గెలిపించుకొని బీఆర్ఎస్ సత్తా చూపడానికి పార్టీ సిద్ధమవుతున్నది. నల్లగొండ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగం పార్టీ క్యాడర్‌లో జోష్‌ను నింపింది. పార్టీ క్యాడర్‌లో రెట్టించిన ఉత్సాహం కనిపించింది.శాసనసభ ఎన్నికల తర్వాత కేసీఆర్ తొలి స్పీచ్ రైతులను బాగా ఆకట్టుకున్నది. అధికార కాంగ్రెస్ పార్టీ తప్పిదాలను ఎక్కడికక్కడ నిలదీయడానికి నల్లగొండ సభతో బీఆర్ఎస్ శ్రీకారం చుట్టగా.. ముందు ముందు ఉద్యమాలకు పురిటిగడ్డ మెతుకుసీమ బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధమవుతున్నారు.

ఇది మరో ఉద్యమం

కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ హయాంలో కాలయాపన తప్ప ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో ప్రజల హక్కులు, రాష్ట్ర వనరులను కాపాడేందుకు మరో ఉద్యమం ప్రారంభమైంది. నల్గొండలో కేసీఆర్ నిర్వహించిన సభ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపింది. తెలంగాణలో కరెంట్, సాగునీరు, జల వనరుల సంరక్షణ, సాధన కోసం కేసీఆర్ పార్టీ శ్రేణులను చైతన్యపరిచారు. సామాన్య ప్రజలు, రైతుల కోసం ఆయన ఇచ్చిన ప్రసంగం అందరినీ ఆకట్టుకున్నది. కృష్ణా నది జలాలను కేంద్రానికి అప్పగించకుండా ఎంతటి పోరాటాలకైన సిద్ధం.

- కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే, దుబ్బాక

కేసీఆర్‌పై ప్రజలకు విశ్వాసం తగ్గలేదు

అధికారంలో లేకపోయినా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ప్రజలకు విశ్వాసం ఏమాత్రం తగ్గలేదు. నల్గొండలో నిర్వహించిన బహిరంగసభ విజయపంతమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణ నది నీటి పంపకాలను కేంద్రానికి అప్పగించిన విషయాన్ని కేసీఆర్ ప్రజలకు అర్థమయ్యే రీతిలో సభలో తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ అభివృద్ధి కోసం ఎంతలా కృషి చేశారో ప్రతి ఒక్కరికీ తెలుసు. కేసీఆర్‌పై ప్రజలకు ఇంకా నమ్మకం, విశ్వాసం ఉందనేది ఈ సభ విజయవంతమే తార్కాణం.

- సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే, నర్సాపూర్

జిన్నారం: బస్సులో నల్గొండ సభకు బయలుదేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

కంది: నల్గొండ సభకు తరలివెళ్తున్న కంది మండల బీఆర్ఎస్ నాయకులు

మెదక్ జిల్లా పెద్దశంకరంపేట నుంచి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట అర్బన్: సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి బహిరంగ సభకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

శివ్వంపేట నుంచి నల్గొండకు వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కేఆర్ఎంబీపై వాస్తవాలు మాట్లాడాలి

తెలంగాణ ప్రభుత్వం కేఆర్ఎంబీపై వాస్తవాలు మాట్లాడాలి. తప్పుడు సమాచారాన్ని పదే పదే చెప్పి అవే వాస్తవాలని మాట్లాడడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. నల్గొండ సభలో కేసీఆర్ రాష్ట్ర హక్కులను కాపాడుకోవడానికి అందరూ సిద్ధంగా ఉండాలని, హక్కుల సాధనకు కలిసికట్టుగా నడవాల్సిన బాధ్యత ఉందని దిశానిర్దేశం చేశారు. కేఆర్ఎంబీపై అనుభవజ్ఞులైన వారిని ప్రభుత్వం తరుపున మంత్రులు సంప్రదించాలి. కేసీఆర్ చెప్పినట్లు ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వం వద్ద రాష్ట్ర హక్కులకు సంబంధించిన అంశాలను చర్చించాల్సిన అవసరం ఉంది. కేసీఆర్ అనారోగ్యంతో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సభను నిర్వహించారు.

- డాక్టరు యాదవరెడ్డి, ఎమ్మెల్సీ

కేసీఆర్ నాయకత్వంలో పోరాటానికి సిద్ధం

కేసీఆర్ నాయకత్వంలో కేఆర్ఎంబీపై మరో పోరాటానికి బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం. నల్గొండ సభలో కేసీఆర్ మాట్లాడిన అంశాలపై ప్రజలు ఆలోచిస్తున్నారు. రాష్ట్ర హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతో ఉంది. నల్గొండలో సభ పెట్టడానికి ముందు రోజే అసెంబ్లీలో అత్యవసర తీర్మానం ప్రవేశపెట్టి, అన్ని రాజకీయ పక్షాల మద్దతు కోరినం. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలి. కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల్లో చిన్న పాటి సమస్యలను భూతద్దంలో చూపించడం పక్కనే పెట్టి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కట్టిన ప్రాజెక్టులను ఎలా వినియోగించుకోవాలో ప్రభుత్వం ఆలోచించాలి.

- వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్

ప్రజలకు కేసీఆర్ భరోసా

అస్తవ్యస్తంగా కొనసాగుతున్న కాంగ్రెస్ పాలనతో ఆందోళన చెందుతున్న ప్రజలకు నల్లగొండ సభతో మాజీ సీఎం కేసీఆర్ భరోసా కల్పించారు. బీఆర్ఎస్ ప్రజలకు అండగా ఉందనే విషయాన్ని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేసీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధి ఏ నాయకుడికీ, పార్టీకి లేదనే విషయం కేఆర్ఎంబీ అంశంతో తేలిపోయింది. తొమ్మిదిన్నరేండ్లు కేఆర్ఎంబీ విషయంలో కేసీఆర్ కఠినంగా వ్యవహరించిన తీరు, అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన విధానం ప్రజలకు అర్థమైంది. ఆరు గ్యారెంటీల అమలు, రైతుబంధు, 24 గంటల విద్యుత్‌ను పట్టించుకోకుండా బీఆర్ఎస్, కేసీఆర్‌పై బురదజల్లుతున్న కాంగ్రెస్‌కు నల్లగొండ సభ ద్వారా హెచ్చరిక జారీ చేశారు. కాంగ్రెస్‌ను గెలిపించి తప్పు చేశామనే ఆవేదనలో ఉన్న ప్రజల్లో నల్లగొండ సభ ఉత్సాహం నింపింది.

- భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, నారాయణఖేడ్

ఉద్యమ స్ఫూర్తిని చాటిన కేసీఆర్ ప్రసంగం

నల్గొండలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిన ప్రసంగం ఉద్యమ స్ఫూర్తిని చాటింది. బహిరంగ సభకు హాజరైన కేసీఆర్ ప్రస్తుత పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చెప్పారు. కృష్ణాబోర్డుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న విష ప్రచారం, కాళేశ్వరంపై చేస్తున్న హంగామాను ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ఆగం చేసేందుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను తెలిపారు. ఒక మేడిగడ్డ పిల్లర్ కుంగితే లక్ష కోట్లు వృథా అయ్యాయనే అబద్ధాలను ప్రజలు గమనించేలా చేశారు. మేడిగడ్డ బరాజ్‌కే లక్ష కోట్లు అయ్యాయా..? మిగతా బరాజ్‌లు, రిజర్వాయర్లు, కాల్వలు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగం కావా..? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన తీరు అందరినీ ఆలోచింపజేసింది. అధికారంలోకి వచ్చాక కృష్ణా బోర్డుకు కృష్ణా జలాల అధికారాన్ని కట్టబెట్టింది కాంగ్రెస్‌యేనని, దీని వల్ల హైదరాబాద్ సహా ఐదు జిల్లాలు ఎడారిగా మారిపోతాయనే విషయం ప్రతి ఒక్కరికీ అర్థమయింది. మొత్తం మీద నల్గొండ సభ ఇటు బీఆర్ఎస్ కార్యకర్తలు, అటు ప్రజల్లో నూతనోత్సాహాన్ని నింపింది.

- వొడితెల సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, హుస్నాబాద్

అబద్ధాలతో కాంగ్రెస్ మోసం



అబద్ధాలతో ప్రజలను మోసం చేసి, ఆరు గ్యారెంటీల పేరుతో వంచించి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వలేదు. ఆరు గ్యారెంటీల అమలుకు నిధులు లేకున్నా నోటిమాటలతో సరిపెడుతున్నది. రైతులకు పెట్టుబడి సాయం నేటికీ అందక అన్నదాతలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే దోచుకుని దాచుకునే సాంప్రదాయం ఉన్న పార్టీ. నల్లగొండ ప్రజలకు తాగు, సాగునీటి సమస్య రాకుండా చేసిన ఘనత బీఆర్ఎస్‌దే.

- చింతా ప్రభాకర్, ఎమ్మెల్యే, సంగారెడ్డి

బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం



చలో నల్గొండ సభతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలు గడిచినా ఇంతవరకు రైతుబంధు ఇవ్వలేదు. పింఛన్ డబ్బులు వేయలేదు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన 420 గ్యారెంటీలు అమలు చేసే వరకు ప్రజలు, రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తాం. ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా పోషిస్తాం. అసెంబ్లీలో మాజీ మంత్రి హరీశ్‌రావు అనేక సమస్యల మీద మాట్లాడితే ఒక్క కాంగ్రెస్ మంత్రి కూడా నోరు విప్పలేదు.

- పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మెదక్

కాంగ్రెస్‌లో వణుకు మొదలైంది



నల్లగొండ సభకు వచ్చిన స్పందన చూసి కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో వణుకు మొదలైంది. అబద్ధాలు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తెలంగాణను ఎడారిగా మార్చేందుకు ప్రయత్నిస్తుంటే చూస్తూ ఊరుకోమంటూ కేసీఆర్ గర్జించడంతో ప్రజలు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ సాధించి, పదేండ్లలో వందేండ్ల అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సొంతం. నల్లగొండ సభతో కేసీఆర్, బీఆర్ఎస్‌పై పార్టీ శ్రేణులతో పాటు ప్రజల్లో మరింత నమ్మకం పెరిగింది.

- చంటి క్రాంతికిరణ్, మాజీ ఎమ్మెల్యే, అందోల్

కానిస్టేబుల్‌ను సన్మానించిన ఎస్పీ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి13: ఐదో జాతీయ మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో జిల్లా పోలీస్ సాయుధ దళ కానిస్టేబుల్ టి.ప్రభాకర్ గౌడ్ కాంస్య పథకం సాధించడంతో మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ బాలస్వామి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు జీహెచ్ఎంసీ బాలయోగి స్టేడియం గచ్చిబౌలి, హైదరాబాద్‌లో నిర్వహించిన 5వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో కాంస్య పథకం సాధించారన్నారు. మే నెలలో శ్రీలంకలో జరుగనున్న అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో దేశం తరపున పాల్గొనడానికి ఎంపికపడం జిల్లా, రాష్ట్ర పోలీస్ శాఖకు గర్వకారణమని పేర్కొన్నారు. జిల్లా పోలీస్‌శాఖలో క్రీడాకారులు పోటీల్లో పాల్గొని పథకాలు సాధించడానికి అన్నివిధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో కాంస్య పథకం సాధించిన కానిస్టేబుల్ ప్రభాకర్‌గౌడ్‌ను శాలువాతో సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి

కొత్త వంగడాలు వినియోగించాలి

భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ ఆర్‌కే మదర్

నారాయణరావుపేట, ఫిబ్రవరి 13: రైతులు కొత్త వంగడాలు వినియోగించి అధిక దిగుబడులు పొందాలని భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ ఆర్‌కే మదర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో పొద్దు తిరుగుడు క్షేత్ర దినోత్సవాన్ని భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ, రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ మదర్ మాట్లాడుతూ రైతులు క్షేత్ర స్థాయిలో పంటల మార్పిడి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట ఎరువుల నుంచి భూమిని సారవంతంగా చేసుకొని ఎక్కువ దిగుబడులు పొందాలని, వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సతీశ్‌కుమార్, శ్రీదేవి, మహేందర్, స్వామి, అనీల్ పాల్గొన్నారు.